# ఎర్రమందారాలు

సాయంత్రం సుకుమారి ఇంటికి రావడంతోటే అత్తగారు, "మీ అమ్మ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది, ఈ మారు పండుగకు నిన్ను తప్పకుండా పంపించమన్నారు" అని చెప్పినప్పుడు సుకుమారి మరింత మురిసిపోయింది.

"నేను ఎట్లా వెళ్ళేది అత్తయ్యా. పూనా నుంచి సుశీలను, సునందను పిలుద్దామనుకుంటున్నాం గదా" అంది.

"సుశీల సునంద వస్తే వస్తారు. దానికేం? నువ్వు వెళ్లు — లేకపోతే మీ అమ్మగారు చిన్నబుచ్చుకుంటారు" అంది ఆమె. సుకుమారి ఇంకా తటపటాయిస్తున్నట్లు గమనించి, "ఇక్కడేమంత పెద్ద పనులు ఉన్నాయి? నేను చూచుకుంటాన్లే. నీవు వెళ్ళి రామ్మా — హైదరాబాద్" అంది. సుశీల, సునంద, సుకుమారికి కవల ఆడబడుచులు. రెండేళ్ళ క్రిందట పెళ్లిళ్ళయి పూనా కాపురానికి వెళ్లారు. వాళ్ల భర్తలూ కవలలు కాదు గాని అన్నదమ్ముల కొడుకులు. గోఖలే ఇన్‌స్టిట్యూట్‌లో ఒకేరకం ఉద్యోగాలు చేస్తున్నారు.

టెలిఫోన్లో తల్లి తండ్రి యేక కంఠంతో చెప్పిన మాటలు సుకుమారికి ఇంకా మనసులో మెదలుతూనే ఉన్నాయి. "ఈ సంవత్సరం, పండక్కు నాలుగు రోజులు ముందుగారా. ఆయన దేశంలో లేరు గదా, అని పోయిన యేడు లాగ రోజుల తరుబడి ఆలోచిస్తూ కూర్చోకు. పండగకు అటు, ఇటు వీలయినంతసేపు ఎక్కువ సెలవు తీసుకో. చెల్లెలు సుహాసిని పెళ్లి కూడా చేసెయ్యాలనుకుంటున్నాము ఈ సంవత్సరం. అక్కయ్య, బావగారు, పిల్లలూ వస్తున్నారు."

సుకుమారి రెండో అమ్మాయి. తండ్రి - హైదరాబాద్‌లోనే స్థిరపడిపోయారు. తల్లి కుసుమకు ఇంకా మూడేళ్లు ఉంది సర్వీస్. ఆమె గవర్నమెంట్ కాలేజీలో ఇంగ్లీష్ హెడ్.

సూర్యనారాయణది పరిమిత కుటుంబం అనడానికి వీల్లేదు గాని - ప్రణా

ళికా బద్ధమైనదిమటుకు అవును. పెద్దమ్మాయి సునందకు ఇప్పుడింకా ముప్పయి యేళ్లే. బి.ఏ. అవడం తోటే పెళ్లి చేసేశారు. భర్త ఇంజనీయర్. ఎక్కువగా సర్వీస్ అంతా ప్రాజెక్టులోనే అవడం వల్ల కాస్త వెనుకవేసుకోవటానికి వీలు అయింది.

పుస్తకాలు పొందిగ్గా పెట్టుకోవడం, యే పుస్తకంలో యే సమాచారం ఎంత వరుకు ఉందో కనిపెట్టగలగడం సుకుమారికి చిన్నప్పటి నుంచి అలవాటు. అది గమనించి తల్లిదండ్రులు 'లైబ్రరీ సైన్స్' చదివించారు. పాతికేళ్లయినా నిండకుండానే అందులో 'డాక్టరేట్' సంపాదించింది, ప్రొఫెసర్ రంగనాథన్ గారి ఇన్‌స్టిట్యూట్ ద్వారా. కాస్త దూరపు బంధువుల అబ్బాయి మెడికల్ డాక్టర్‌గా బొంబాయిలో స్థిరపడి ఉన్నాడని తెలుసుకుని, దూరం అయినా ఫరవాలేదని సంప్రదాయకుటుంబం గదా అని ముడిపెట్టేశారు. పెళ్లయిన యేణ్ణర్థంలోనే అతనికి లండన్ వెళ్లే సదవకాశం వచ్చింది. జారవిడుచుకోవడం ఇష్టం లేదు. భార్యను కూడా తీసుకు వెళ్లే పరిస్థితి కాదు. సుకుమారి ధైర్యం చెప్పింది. 'నేను యేదన్నా ఫెలోషిప్ సంపాదించి వస్తాను మీ వెనుకనే. మంచి ఆఫర్ వచ్చినప్పుడు ఎందుకు పోగొట్టుకోవడం?' మూడువంతులు ఈ అమ్మాయి నూరిపోసిన ఉత్సాహం మీదనే అతను విదేశం వెళ్లగలిగాడు ధైర్యంగా.

పోతే మూడవ అమ్మాయి సుహాసిని. ఆర్ట్సులో డిగ్రీ అయింది. చదువులో పెద్ద అభిరుచి లేదు. ముందు యేం చేస్తుందో తెలియదు. తల్లి వ్రాసిన ఉత్తరాన్ని బట్టి సంబంధం దాదాపు స్థిరమవుతున్నట్లే!

పిల్లల విషయంలో మగ ఆడ తేడాలు లేవు. చేతనయినంత వరకు చక్కగా పెంచడం, విద్యాబుద్ధులు చెప్పడం, పెళ్లిళ్లు జరిపించడం... ఇంత కంటె మరేం పెద్ద బాధ్యతలు పెట్టుకోదలచలేదు సూర్యనారాయణా, కుసుమా. సుహాసిని కడసారి పిల్ల గనుక తతిమావాళ్ల కంటె ముద్దుగా పెరిగింది. తల్లిదండ్రులకే కాదు, అక్కలకూ మురిపాల చెల్లెలు, దాంతో కాస్త పెంకితనం, అర్థంలేని పట్టుదల ఎక్కువ.

—సుకుమారి జవాబు వ్రాయడానికి ముందుగానే, రెండో ఉత్తరం వచ్చింది, తల్లి దగ్గర్నుంచి, వస్తున్నావా, ఎప్పుడూ -- అని ఏ రైలుకు వస్తున్నావో చెబితే సుహాసిని స్టేషన్‌కు వస్తుంది అనీని.

ఆ మరునాడే ఆఫీసు నుంచి టెలిఫోన్ చేసి చెప్పేసింది. సుకుమారి తండ్రికి ఫలానా అప్పుడు వస్తున్నాను అంటూ. 'అమ్మకు చెప్పండి నాన్న, అమ్మ అప్పుడే కాలేజికి వెళ్ళిందా?' అనడిగింది.

"అలాగే అలాగేనమ్మా. అల్లుడి దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయా? కులాసాగా ఉన్నాడా?" అనడిగారు తండ్రి. "రాత్రే మాట్లాడారు నాన్నా, కులాసాయే."

—సుకుమారి ప్రయాణానికి అవసరం అయిన యేర్పాట్లన్నీ నెమరువేసుకుంటూంది.

* * *

సుహాసిని కారు తీసుకువచ్చింది. ఇంకా 'లెర్నర్ లైసెన్స్' గనుక తండ్రి పక్కనే ఉన్నారు.

'నేను డ్రయివ్ చేస్తాన్లే. నువ్వు పక్కన కూర్చుని కబుర్లు చెప్పు' అంది సుకుమారి.

'వద్దమ్మా మీరిద్దరూ వెనక్కు రండి, కబుర్లలో పడి డ్రైవింగ్ చేయడం మంచిది కాదు. అందులోనూ ఇది వెనకటి హైద్రాబాద్ కాదు—' అన్నాడు తండ్రి.

దాంతో చక్రం ముందు సూర్యనారాయణ, వెనకాల సుకుమారి, సుహాసిని అయిపోయారు.

మారుతి కారు సికింద్రాబాద్ స్టేషన్ తప్పించుకుని మారేడ్ పల్లి వైపు పరుగులు తీస్తోంది.

'మనం వెళ్ళేటప్పటికి అమ్మ వచ్చేస్తుంది ఇంటికి' అంది సుహాసిని.

'పెళ్లి యెప్పుడో యేమిటో అనుకున్నారా, ఇంకా లేదా?' అని అడిగింది సుకుమారి నింపాదిగా, సుహాసినిని.

నాన్న వైపు సైగ చేసి సుకుమారి చెవిలో 'ఇంటికి వెళ్లాక చెబుతాలే' అంది. చెల్లెలి బుగ్గలు కెంపులయ్యాయా అని పరీక్షగా చూచింది సుకుమారి.

ఉహూ.

'రాజేంద్ర వస్తున్నాడా?'

'ఊ' అంది మళ్లీ నింపాదిగా సుహాసిని.

—అమె రాజేంద్రను ఇష్టపడుతోందని, బొత్తిగా నాటకాలు వేసే వాడితో పెళ్లి చేయడం ఇష్టం లేదని, యేడెనిమిది నెలల క్రిందటి తల్లి ఉత్తరం వ్రాసింది.

అయితే ఈ లోపల చాల మార్పులు వచ్చాయి అనుకోకుండానే. బహుశ

దానికోసం అతను తపస్సుకూడా చేస్తున్నాడేమో — అతనికే తెలియాలి, అతనికి సినిమా ఛాన్స్ వచ్చింది.

సినిమాలో నటించటానికి అవకాశం వచ్చిందీ అంటే యెగిరి గంతువేయలేదు రాజేంద్ర. అతని దృష్టిలో అన్ని ఉద్యోగాల వంటిదే ఇది కూడా. 'సినిమాలో నటించడం కాదు, నాకు కావలసింది. డైరెక్ట్ చేయడం నేర్చుకోవాలి' అన్నాడు. అయితే అందుకు నాందిగా నటించక తప్పలేదు.

అతను వేషం వేసిన సినిమా బాగా 'పాపులర్' అయింది. అతనికి మళ్ళీ వేషాలు వేయమని 'ఆఫర్సు' రాలేదు. కారణం, అతను తనకు ఆక్టింగ్‌లో యేమాత్రం అభిరుచి లేదని, డైరెక్షన్‌లోనే కాన్‌సెన్‌ట్రేట్ చేస్తాననీ అందరికీ ముందు నుంచి చెవుల్లో ఇల్లు కట్టుకుని చెప్పడమే.

మంచి పేరున్న డైరెక్టర్ దగ్గర అసోసియేట్‌గా చేరి, పని నేర్చుకుంటున్నాడు. ఓ సంవత్సరంలో స్వంతంగా డైరెక్షన్ చేసి, 'పిక్చర్లు' తీసే అవకాశం వస్తుంది. అతనికా ధైర్యం ఉంది.

—ఈ సంగతులు సూచనగా సుకుమారికి తెలుసు. ఇంటికి చేరుకునే సరికి బాగా అలసట పడింది సుకుమారి.

స్నానం, భోజనం కానిచ్చి హాయిగా మూడు గంటల పాటు నిద్రపోయింది. రాత్రి భోజనాల దగ్గరే అందరూ ఒక చోట చేరారు.

'నువ్వు చిక్కిపోయావు సుమా—' అంది అక్కయ్య.

'లేదు. ఆ మాట నిజం కాదు. నిజానికి నేను కాస్త లావు అయ్యాను. ఆ మాట మా అత్తగారు కూడా ఒప్పుకున్నారు. పోతే, నువ్వు సన్నబడ్డావు అక్కయ్యా, మాటకు మాట అంటున్నానని అనుకోకు. కావాలంటే అమ్మను కూడా అడుగు—' అంది సుకుమారి, మాటలలో సిన్సియారిటీ కొట్టవచ్చినట్టు కనిపింపచేస్తూ.

కుసుమ, 'నేను అదే మొత్తుకుంటున్నాను తండ్రీ - కూతురు నా మాట కొట్టిపారేస్తున్నారు. ఏమండీ, విన్నారా? సుకుమారి కూడా యేం అంటోందో. సునయన చిక్కిపోయిన మాట యదార్థమే—' అంది.

'అవునామ్మా — నిజంగానా?' అన్నాడు సూర్యనారాయణ, ఎటు మాట్లాడటానికీ తోచక. 'నిజం, నాన్నగారూ. నేను అక్కయ్యను చూచి సంవత్సరం అయింది గనుక ఈ విషయం ఘంటాపథంగా చెప్పగలను--' అంది సుకుమారి.

'ఎందుకే అట్లా చిక్కిపోయావు మరి?' అనడిగాడు సూర్యనారాయణ ఈ

మారు.

'ఆ ప్రాజెక్ట్ యేరియూ నాకు పడలేదు నాన్నగారూ--' అంది నసుగుతూ సునయన.

'బదిలీ కోసం ప్రయత్నిద్దాంలే. మరేం బెంగపోట్టుకోకు.'

అక్కడితో ఆ ప్రస్తావన ముగిసింది.

మరునాడు మధ్యాహ్నం మేడ మీద గదిలో ఇద్దరూ వంటరిగా ఉన్నప్పుడు సునయన అంది చెల్లెలితో 'నీకు ఇప్పుడే చెప్పడం మంచిదనుకుంటాను, సుకుమారీ, నేనూ, మా ఆయనా విడాకులు తీసుకుందాం అనుకుంటున్నాం.'

ఉలిక్కిపడింది సుకుమారి. 'ఏమిటి అక్కయ్యా? ఏమిటి నువ్వు అంటున్నది?'

'పెద్దగా అరవకు, ఇంకా ఇంట్లో యెవరికీ చెప్పలేదు. అమ్మకు తెలియనివ్వకు. అస్సలే నీరసం మనిషి. అసలు నీతో ఈ విషయం 'డిస్కస్' చేద్దామనే ఈ మారు నేను పెందలాడే వచ్చింది--' అంది సునయన, కళ్లు టపటపలాడిస్తూ.

సుహాసిని పైకి వచ్చింది. అక్కచేతిలో ఫోటో అల్బమ్స్ ఉండడం చూచి సుకుమారి నిదానంగా నవ్వుతూ, 'ఏమిటే అది? మీ ఆయనవా?' అంది.

సుహాసిని చురుగ్గా చూచింది అక్కవంక.

'దాన్ని ఉడికించకే సుకూ. ఇంకా "ఆయన" కాలేదుగా అందుకని దానికి అలా పిలిపించుకోవడం ఇష్టం ఉండదు.' అంది సునయన.

సుకుమారికి తన తొందరపాటు తెలిసి వచ్చింది. మనసులోనే కాస్త బాధపడి 'కూర్చోవే. నించున్నావేం?' అంది తన పక్కన చోటు చేస్తూ.

'పెద్దక్కయ్యకు చెప్పాను. నీకు చెబుదామనే వస్తున్నాను'.

సుకుమారి ప్రశ్నార్థకంగా చూసింది.

సుహాసిని మధురంగా నవ్వింది. ఈ నవ్వుకు యెవరయినా పడిపోతారు. అమ్మ, నాన్న దీనికి మంచి పేరు పెట్టారు -- అనుకుంది సుకుమారి.

'రాజేంద్రను చేసుకోవడం తప్పనిసరి అని నేను అనుకోవడం లేదు,' అంది సుహాసిని గొంతు కాస్త తగ్గించి.

'ఇంకెవరినైనా ప్రేమించావా?'

లేదని తల అడ్డంగా వూపింది.

'అతను ఇష్టంలేదంటున్నాడా?'

'అతన్ని నేను అడగలేదుగా అసలు'

'మరయితే యేమిటి నీ అభ్యంతరం?'

'ఎరేన్జ్‌డ్ మారేజెస్ నాకు ఇష్టం లేదు.'

'పోనీ నీవే ప్రేమించు అతన్ని. అమ్మనీ, నాన్ననీ– అతన్ని పెళ్ళి చేసుకోవటానికి వీల్లేదని నిన్ను కట్టడి చేయమంటాను. సరేనా? అంది సుకుమారి, నవ్వేస్తూ.'

'మీరిద్దరూ ఎరేన్జ్‌డ్ మారేజెస్ చేసుకున్నారు. కులాసాగా ఉన్నారనే అనుకుంటున్నాను. కాని నా మనస్థితి వేరే. నాకు ఈ ఎరేంజ్‌మెంట్ ఇష్టంలేదు.'

'మరి రాజేంద్ర అంటే ఇష్టపడుతున్నావు గదా, అప్పుడు' అన్నది సునయన.

'ఎరేన్జ్‌డ్? కాదా అనే విషయం పక్కనబెట్టి ఒక్క సంగతి చెప్పు, సుహా' అనడిగింది సుకుమారి.

'ఏమిటది?'

'పెళ్ళి చేసుకుంటావా? పైకి చదువుతావా? నువ్వు చదువుకుంటానంటే నాన్నగారికీ అమ్మకీ చెప్పి నిన్ను బొంబాయి తీసుకుపోతాను. నాకు తోడుగా ఉంటావు.'

'ఊహూ, చదవను'

'అయితే పెళ్ళికే మొగ్గుతావన్నమాట, మరి రాజేంద్ర విషయంలో నీకు యేమిటి అభ్యంతరం?'

'అతను సినిమాలో హీరో అయితే బాగుండేది. అతన్ని నేను ఇష్టపడినది అందుకోసమే.'

'మరి డైరెక్షన్‌లో మంచిపేరు తెచ్చుకుంటున్నాడు గదే. అతని ప్రొఫెషన్– అతని ఇష్టం'.

'నాకు ఇష్టం కాదంటున్నాను' అంది సుహాసిని పెంకిగా.

'రాజేంద్ర కాదు, సినిమా యాక్టర్ రాజేంద్రకావాలి. ఇదన్నమాట నీ డైలాగూ, అంతేనా?' అంది సుకుమారి నూటిగా సుహాసిని కళ్ళలోనికి చూస్తూ.

'అంతే' అని కళ్ళు చికిలించింది సుహాసిని.

'డైరెక్టర్– అంటే ఇమేజ్ తగ్గిపోతుందనేగా నీ బాధ' అంది సునయన

బొత్తిగా గ్లామర్ అనడం ఇష్టంలేక.

'చూద్దాంలే. అతను వస్తాడంటున్నావు గదా— తేల్చేద్దాం, అతని సంగతి' అంది సుకుమారి.

సుహాసిని థాంక్స్ చెప్పుకుంది అక్కయ్యకు మనసులోనే.

రాజేంద్రను తాను ఇప్పుడు ఇష్టపడడం లేదని తెలిస్తే, అమ్మ—నాన్న ఎంతగా బాధపడతారో ఆ పిల్ల మనసులో మెదులుతూనే ఉంది.

మళ్లీ వంటరిగా ఉన్నప్పుడు సుకుమారి అడిగి తెలుసుకుంది సునయన సమస్య యేమిటో.

బావగారు బాగా తాగుతున్నారు. విచ్చలవిడితనం కూడా పెరిగి పోయిందట. ఆయన తననేమీ అనకపోయినా, తనంటే యేమీ శ్రద్ధ లేకుండా తిరగడం సహించలేకపోతోంది సునయన. ఇదీ సుకుమారి అర్థం చేసుకోగలిగిన పరిస్థితి. ఇద్దరు పిల్లలున్నా 'విడాకులు' తీసుకోవటానికి జంకు, గొంకులేదు. పోషణకు ఎలాగైనా డబ్బు వస్తుందిగదా?

'అసలు ఆయన ఈ రోజు రానన్నారు ఇక్కడికి. నేనే నా 'ఫేస్ సేవింగ్' కోసం రమ్మన్నాను. బలవంతాన వప్పుకున్నారు. పై నెలలోనే కోర్టులో పిటీషన్ పడేద్దాం అనుకుంటున్నాం' అంది సునయన.

ఇంటికి పండుగ కళ వచ్చేసింది.

మామిడి తోరణాలు, పూలవాసనలు సరేసరి. పెద్దమ్మాయి, కొడుకులు ఇద్దరూ, ఇంకా వీళ్లతో ఆడుకుందుకు వచ్చిన పక్కయింటి కుర్రవాళ్లతో ఇల్లు గందరగోళంగా తయారయింది.

కుసుమ ప్రతిక్షణం అందరికీ కావలసిన 'లఘుపానీయాలు' అందేట్లు చూడడంతో చాలా బిజీగా ఉంది. వంటమనిషికి ఈ రెండురోజులు చేయవలసినవి అన్నీ చెప్పివేయడం వారం రోజుల క్రితమే అయిపోయింది. పండుగ రోజులు కూడా యే మాత్రం హడావడి లేకుండా 'మెథాడికల్'గా నడిపించడంలోనే ఆమె చాకచక్యం ఉంది.

సునయన మొగుడు ఎక్కువగా మామగారి తోనే సమయం గడుపుతున్నాడు. ఇద్దరికీ చదరంగంలో స్నేహం ఎక్కువ. రంగస్వామి కాదు ఆయన పేరు ఇక్కడ. చదరంగస్వామి! సునయన అయితే ఈ మధ్య కోపం కొద్దీ తురంగస్వామి అంటూంది కూడా.

సుకుమారి ఆయనతో మాట్లాడేసింది అవకాశం చూచుకుని. ఆయన

సూక్ష్మంగా చెప్పింది ఇది. 'ఇందులో నా ప్రమేయం యేమీ లేదు. నన్నేం అనకు. కాస్త విచ్చల విడి తనం ఉన్న మాట నిజమే. అయితే యేం మునిగి పోయిందిట? సునయన అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే. అనవసరంగా... మరీ ఎక్స్ట్రిమిటీస్‌కు లాక్కుపోతూంది. తను చెప్పిన మాట నేను యెప్పుడూ కాద నను. ఆఖరుకు విడాకుల విషయంలో కూడా! నేనే అంత ఇన్-టాలరబుల్, డెస్పరేట్ కారక్టర్ను కాదు.'

ఆయన మారితే నాకేం అభ్యంతరం లేదంటుంది-- సునయన.

'అయితే ఒక పని చేయండి. రేపు మధ్యాహ్నం మీరు, నాన్న చదరంగం ఆటకు కూర్చుంటారు గదా. అదే ఫైనల్ గేమ్ అనుకోండి. ఆ ఆటలో మీరు గెలిస్తే విడాకుల ప్రసక్తి లేదు. పొరపాటున నాన్నగారు గెలిస్తే విడా కులు మంజూరు అయినాయే అనుకోండి--' అని సజెస్ట్ చేసింది-- సుకుమారి. చదరంగంలో ఇద్దరూ సమఉజ్జీలే.

సాధారణంగా మామగారు గెలవడమే పరిపాటి. అయినా చదరంగానికి జీవిత రంగానికి సామ్యం మేమిటో యెందుకు ఉండాలో రంగస్వామికి గాని, సునయ నకుగాని అర్థం కాలేదు. సుకుమారి ఇలా వివరించింది--

'నన్నడిగితే-- విడిపోవడానికి మీకు ఇద్దరికీ ఉన్నది చాల బలహీనమైన కార ణాలు. ఏ మాత్రమూ బలమైనవి కావు. ఇద్దరిలోనూ సరిదిద్దుకోవటానికి, సర్దుకు పోవటానికి ఉత్సాహం కనిపిస్తూనే ఉంది. అందుకని ఈ విషయం ఈ 'ఛాన్స్'కు వదిలివేయండి. అలా చేయడమే మంచిదని నాకు అనిపిస్తోంది. అంతకంటే మరేం లేదు.'

ఇద్దరూ అంగీకరించారు. ఈ విషయం ఇంట్లో మరెవరికీ తెలియవలసిన అవసరం కూడా లేదనుకున్నారు.

రాజేంద్ర అందరికీ దగ్గరి వాడు అయినాడు. చనువుగా ఇల్లంతా కలయ తిరుగుతున్నాడు.

'మీరు ఇంగ్లాండ్ వెళ్లిపోయినా, మా సినిమా వీడియో కేసెట్లు పంపుతూ ఉంటాను. అక్కడి తెలుగువాళ్లనందరికీ చూపిస్తూ ఉండండి' అన్నాడు సుకు మారితో.

'తెలుగు వాళ్లకు మాత్రమేనా? అందరికీ చూపిస్తాను. ఇంగ్లీష్ సైటిల్స్ ఇంప్రింట్ చేసి పంపండి మన టి.వి.లో మోస్తరుగా. ముందుగా అందరికీ సూక్ష్మంగా కథ గూడా చెబుతాను. భారత చలనచిత్ర పరిశ్రమ గురించి నా

దగ్గర బోలెడు మెటీరియల్, ఇన్‌ఫర్మేషన్ ఉన్నది. మన తెలుగువాళ్లు – సినిమా పద్ధతులన్నీ ప్రత్యేకంగా చేసి వాళ్ల ముందు ఉంచుతాను. సరేనా?' అంది ఆమె.

అతను పొంగిపోయాడు.

'మన సినిమాల్లో ఇప్పుడు టెక్నికల్ వాల్యూస్ బాగా విస్తరించాయి. స్టోరీ ట్రీట్‌మెంటు మీద ఎంత శ్రద్ధ తీసుకుంటున్నా మనుకుంటాన్నారు. ఇదివరకు హీరో -- హీరోయిన్ ఓరియెంటెడ్‌గా వచ్చేవి పిక్చర్స్. పురాణ కథలయినా సాంఘికాలయినా కథా బలం మీద కొట్టుకుపోయేవి లోగడ. ఇప్పుడు డైరెక్షన్‌లో ఉన్న విలువలను బట్టే పిక్చర్స్ నడవడమో - నడవక పోవడమో తేలిపోతుంది--' అంటూ చిత్ర నిర్మాణాన్ని గురించి చెప్పసాగాడు.

సుకుమారితో పాటు సుహాసిని కూడా ఇవన్నీ ఉత్సాహంగా వింటూ కూర్చుంది.

'డైరెక్టర్ అంటే ప్రజలకు తెలియదు. యాక్టర్స్ అంటేనే ప్రజలకు ప్రాణం' అంది సుకుమారి, సుహాసిని వంక నిరుద్దేశ్యంగానే చూస్తూ.

'ప్రాణం అంటే గ్లామర్ అని కాబోలు మీ ఉద్దేశ్యం. అంతెందుకు? కాబరే డ్యాన్స్ చేసే వాళ్లంటేనూ, స్టంట్ ఫైటింగ్ చేసే యాక్టర్లంటేనూ గ్లామర్ గదా జనానికి. సినిమాకు పాటలు -- మాటలు వ్రాసే వాళ్ళంటేనూ ఉంటుంది. గ్లామర్. సంగీతం కంపోజ్ చేసే వాళ్లకు గొప్ప ఇమేజ్. ప్లేబ్లాక్ ఆర్టిస్టులకు సరేసరి.

'కాని -- అన్నింటినీ తగుపాళ్లలో కలిపి మొత్తం పిక్చర్‌కు ప్రాణంపోసే మనిషి డైరెక్టర్. అతనికి నటన, రచన మొదలైనవి; ఫోటోగ్రఫీ, ఎడిటింగ్ లాంటివి ఎంత ఎక్కువ తెలిసి ఉంటే అంత మంచిది. లేకబోతే తేలిగ్గా బోల్తాపడతాడు. ఏ సన్నివేశం ఎలా పిక్చరైజ్ చేయాలో ఆలోచించి నిర్ణయించే మనిషి డైరెక్టర్ -- నేను ఆ పని నేర్చుకుంటున్నాను గనుక దానిని గురించి గొప్పగా చెబుతాన్నానని అనుకోకండె--' అంటూ అతను తన దగ్గరున్న వీడియో కేసెట్లు ఉపయోగించి వాళ్లందరికీ పెద్దసోదాహరణ ప్రసంగం ఇచ్చాడు. డైరెక్టర్ అంటే సినిమా పరిశ్రమలో ఎంత కీలకమైన పాత్రో అందరికీ ఎఱుక పరచాలని అతని ఆదుర్దా.

అన్నిటికీ మించి అవగాహనకు, వివరణ శక్తికి ముగ్ధులయి పోయారు కుసుమ, సుహాసినీని.

మరునాడు మధ్యాహ్నం సుహాసినిని ప్రత్యేకంగా పిలిచింది సుకుమారి. 'ఏం! రాజేంద్రకు చెప్పేయమంటావా నీవునాతో బొంబాయికి వచ్చేస్తున్నావని?' అని అడిగింది.

'పో అక్కయ్యా నీకు మరీ వేళాకోళం అయిపోతోంది' అంది సుహాసిని మూతి బిగించి. 'మరి అతన్ని గురించి హేళనగా తక్కువగా మాట్లాడం ఆపివేస్తావా?' అనడిగింది సుకుమారి.

'తెరమీద కనిపించే యాక్టర్ కావాలనే మోజుతో నేను కాస్త పొరపాటు పడిన మాట వాస్తవమే. కాని అతను డైరెక్టర్ పాత్రగురించి చెప్పిన వివరాలు వింటూ వుంటే తల తిరిగిపోయిందనుకో...'

'ఏదయినా అంతే సుహాసిని. మనకు పరిపూర్ణ మైన అవగాహన ఉంటే యే పనైనా గొప్పగానే కనిపిస్తుంది. మనిషి చేస్తున్నది - అ మనిషి ఎంత గొప్పవాడయినా కానీ - చాలా అల్పమయిన పనే. దానికి రాణింపు వచ్చేది తతిమ్మా వాళ్లపనులతో అది సమంజసంగా అతుక్కుపోయినప్పుడే, ఇమిడినప్పుడే. సరేగాని... అతనితో నువ్వేం దుడుసుగా మాట్లడలేదు గదా!'

'నీకు చెప్పాడా రాజేంద్ర?- అయాం సారీ అక్కయ్యా. అతన్ని గురించి అభిప్రాయం మార్చుకోకపోక ముందు కాస్త తొందరపడి హేళన చేసిన మాట నిజమే.'

సుకుమారి నవ్వుతూ, 'అతనేం చెప్పలేదులే. బుజాలు తడుముకోకు. ఒక్క విషయం మాత్రం గుర్తు ఉంచుకో సుహాసినీ. నువ్వు సుమధుర భాషణివి కూడా కావాలి. నీ తర్వాత ఇంకో అమ్మాయి పుడితే అమ్మనాన్న ఆ పేరు పెట్టి ఉంటే వాళ్లగదూ దానికి. అందుకని అన్ని రోల్స్ నీవే ప్లే చేయాలి' అంది బయటకు పోబోతున్న చెల్లెలిని సుతారంగా బుగ్గమీద ముద్దుపెట్టుకుని.

మరో పక్క సునయన గదిలోనికి వచ్చింది.

'మీ మాటలన్నీ విన్నాను. సుకూ నువ్వు నిజంగా తెలివయిన దానివి అని ఇప్పుడే మరోసారి గ్రహించాను సుమా.'

'యేమయింది, అక్కయ్యా.'

'యేమయిందో నాకేం పట్టదు. చదరంగం ఎవరు ఓడిపోయినా, ఎవరు గెలిచినా నేనుమాత్రం విడాకుల ప్రసక్తి తీసుకురాను.

'యేం?'

'జీవితంలో ఎంత సర్దుబాటు, నిదానం అవసరమో రాజేంద్ర చూపించిన

సినిమా బిట్స్‌లో నాకు స్పష్టంగా అర్థం అయింది. సుహాసిని యేమనుకుంటుందో తెలియదు గాని, నాకు మాత్రం బాగా కనువిప్పు అయింది.'

ఎవరో పైకి వస్తున్న చప్పుడు వినిపించడంతో సునయన మిన్నకుండి పోయింది.

'మీరిద్దరూ ఇక్కడున్నారా! అల్లుడు నన్ను ఈ ఆటలో చిత్తుగా ఓడించేశాడు. అమ్మ టీకి పిలుస్తోంది పదండి—' అంటూ సూర్యనారాయణ పైకి వచ్చాడు. సుకుమారి "రిటైర్ అయిన తరువాత మీరు ఆటయింకా ఇంప్రూవ్ చేశారను కున్నాను, నాన్నా" అంది.

'ఏదమ్మా, ఇంకా మూడు నెలలేగా అయింది. రండి రండి— అందరూ మీకోసం కనిపెట్టుకు ఉన్నారు'.

ఫలహారాల బల్లదగ్గర చిన్నక్కయ్య "అయితే నాన్నగారూ, సుహాసిని పెళ్లి ముహూర్తం ఎప్పుడు పెడతారో ముందుగా తెలిస్తే మేం మా పనులు ఎడ్జస్ట్ చేసుకుందుకు వీలవుతుంది," అంది.

"హీరో, హీరోయిను కాల్‌షీట్లు ఇవ్వనప్పుడే గదా రాజేంద్రకు తీరుబడి దొరికేది. ఆసంగతి అతన్నే అడుగుదాం. ఏమిటోయ్ నీ అభిప్రాయం?" అన్నాడు సూర్యనారాయణ.

'అభిప్రాయం చెప్పేంత ప్రాయం నాకెక్కడ ఉన్నదండీ. అయినా ఈ సీను ఇలాగే పిక్చరైజ్ చేస్తే బాగుంటుంది మామగారూ,' అన్నాడు రాజేంద్ర, మరో పక్కనుంచి. ఆ మాటలకు అందరూ అరగంటసేపు నవ్వుకున్నారు. సుకుమారి తల్లిని సుహాసిని వంక చూడమని సైగ చేసింది.

అనుకోకుండా అందరూ సుహాసిని వంక చూచారు. ఆమె బుగ్గలు అప్పుడెవరికీ కనబడలేదు. అక్కడ ఎర్ర మందారాలు పురులు విప్పుకుంటున్నాయి.